VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 131
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
ఆదివారం 18 అక్టోబర్ 2026

# చంద్రబాబు తో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి భేటీ





**అమరావతి,కలంకౌంటర్ :** సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు తో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణం సహా రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. యువగళం పాదయాత్ర పుస్తకాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కు మంత్రి నారా లోకేష్ అందజేశారు. తన పాదయాత్రకు సంబంధించిన అంశాలను మధ్యప్రదేశ్ సీఎం కు వివరించారు.

# క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి 'పవన్ కల్యాణ్'తో మధ్యప్రదేశ సీఎం 'మోహన్ యాదవ్' భేటీ..!





**మంగళగిరి,కలంకౌంటర్ :** 'నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్'లో పులుల సంరక్షణ బలోపేతంపై చర్చ. జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా అడవి దున్నల పునఃప్రవేశ ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ విజ్ఞప్తి. త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించిన పవన్ కల్యాణ్. మోహన్ యాదవ్‌కు ఉప్పాడ పట్టు శాలువాతో సత్కారం.. కొండపల్లి కళాకృతి, దుర్గాదేవి చిత్రపటం, అరకు కాఫీ బహూకరణ. ప్రతిగా పవన్ కల్యాణ్‌కు ఓంకారేశ్వర స్వామి ప్రతిమ, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదం అందజేసిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్.

## జనసేన అభ్యర్థుల తొలి జాబితా వచ్చేసింది..
## విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధా

- స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన తొలి జాబితా విడుదల
- విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరు ఖరారు
- ఏలూరు మేయర్ బరిలో రెడ్డి అప్పలనాయుడు
- 12 మున్సిపాలిటీలకు ఛైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన పార్టీ
- పొత్తులో భాగంగా 4 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలలో జనసేన పోటీ



**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. అధికార కూటమిలో పొత్తుల సర్దుబాటులో భాగంగా తమకు కేటాయించిన స్థానాల్లో పోటీ చేసే మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను శనివారం అధికారికంగా ప్రకటించింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ జాబితాను విడుదల చేశారు. రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదు–రుచూస్తున్న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరును జనసేన ఖరారు చేసింది. అదేవిధంగా ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా రెడ్డి అప్పలనాయుడును బరిలోకి దించుతున్నట్లు వెల్లడించింది.

**వీరితో పాటు 12 మున్సిపాలిటీలకు ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను కూడా పార్టీ ప్రకటించింది..**

అమలాపురం: నల్ల శ్రీధర్ ,చిలకలూరిపేట: తోట రాజేశ్వరి , గొల్లప్రోలు: కదారి తమ్మయ్య నాయుడు , నరసాపురం: కొత్తపల్లి శైలజ , నిడదవోలు: కల్లం జ్యోతి , పెడన: మట్టా శివపావని , పిఠాపురం: బీరా విజయ్ శేఖర్ , పుత్తూరు: డి. ఏలుమలై

సాలూరు: గొర్లె విజయకుమారి, సామర్లకోట: పిట్టా జానకీ రామారావు, తెనాలి: టి. వెంకటరమణారావు, తిరువూరు: పి. మాధవి టీడీపీ, బీజేపీతో ఉన్న కూటమిలో సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం, జనసేన పార్టీ మొత్తం నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు (శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ) మరియు 21 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలలో పోటీ చేయనుంది. ప్రస్తుతం ప్రకటించినవి తొలి విడత అభ్యర్థులు మాత్రమేనని, త్వరలోనే మిగిలిన స్థానాలకు కూడా పేర్లను వెల్లడిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

## దసరా రద్దీ: విజయవాడ హైవేపై కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్

- దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ
- యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా ట్రాఫిక్‌కు అదనపు అడ్డంకి
- రద్దీని తగ్గించేందుకు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లింపు

**విజయవాడ, కలంకౌంటర్ :** దసరా పండుగ పురస్కరించుకుని హైదరాబాద్ నగరవాసులు భారీ సంఖ్యలో సొంతూళ్లకు పయనమవడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి వాహనాలు పోటెత్తాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. పండుగ సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే ప్రయాణాలు ప్రారంభం కాగా, శనివారం ఉదయానికి రద్దీ మరింత తీవ్రమైంది. విజయవాడ వైపు వెళ్లే వాహనాలతో టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల్లో కొద్ది నిమిషాల్లోనే దాటాల్సిన టోల్‌గేట్‌ను దాటేందుకు గంటల సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు, ఇదే మార్గంలోని చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం ట్రాఫిక్‌కు అదనపు ఆటంకంగా మారింది. నిర్మాణ పనుల కారణంగా వాహనాలన్నీ సర్వీస్ రోడ్డు మీదుగా నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో, ఇది వాహనాలు నిలిచిపోవడానికి మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు రంగంలోకి దిగి, టోల్‌ప్లాజా వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని మోహరించారు.

# స్థానిక ఎన్నికల హింసపై ఈసీ సీరియస్..

## నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షనేనని అధికారులకు పునేఠా వార్నింగ్!

- నిన్నటి నామినేషన్ల ఘర్షణలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీరియస్
- రాయచోటి, పుంగనూరు ఘటనలపై నివేదిక కోరిన ఎస్ఈసీ
- అల్లర్లు జరగకుండా చూడాలని అధికారులకు కఠిన ఆదేశాలు
- విధుల్లో నిర్లక్ష్యం చూపిస్తే సస్పెన్షన్, బదిలీ తప్పదని హెచ్చరిక



**విజయవాడ, కలంకౌంటర్ :** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకుంటున్న ఘర్షణలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా, వెంటనే బదిలీ చేస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. నేడు విజయవాడలో పోలీసు, ఎన్నికల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన అల్లర్లపై నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పునేఠా స్పష్టం చేశారు. ఈ అంశాలపై పలు రాజకీయ పార్టీల నేతలు తమను కలిసి ఫిర్యాదు చేశారని, వెంటనే సంబంధిత జిల్లా ఎస్పీలతో మాట్లాడామని తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని, అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా ఘ–ర్షణలు జరిగితే అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తేవాలని సూచించారు. అర్హత ఉన్న అభ్యర్థులందరికీ భద్రత కల్పించాలని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ముగ్గురికి మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారమే తాము ఈ మార్గదర్శకాలు జారీ చేశామని, వాటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పునేఠా మరోసారి హెచ్చరించారు.

## పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- పులివెందులలో స్థానిక ఎన్నికల నామినేషన్ల వద్ద ఉద్రిక్తత
- వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట
- జనాన్ని చెదరగొట్టేందుకు గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం
- ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి




**కడప జిల్లా పులివెందుల,కలంకౌంటర్ :** కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో పులివెందులలో ఒక్కసారిగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వివాదం మొదలైంది. పోలీసుల నిర్ణయంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గుంపును చెదరగొట్టి, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న తీవ్రమైన రాజకీయ పోటీయే ఈ ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. ఘటన అనంతరం పులివెందులలో భారీగా పోలీసులను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు.

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



**విజయవాడ, కలంకౌంటర్ :** టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారు–స్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘ–ర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రికి ఆహ్వానం



**విజయవాడ, కలంకౌంటర్ :** కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ని శైవ క్షేత్రం తాళ్లాయపాలెం శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి వారి సంస్థానం తరపున కలిసి శ్రీ శైవ క్షేత్రానికి డాక్టర్ పెమ్మసాని దంపతులను ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో శైవ క్షేత్ర ప్రతినిధులు కే శ్రీనివాసరావు ,చిరుదీప్ , వక్కలగడ్డ కిషోర్, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణశ్రేష్ఠి, ధ్రువరామ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ పెమ్మసాని త్వరలో శైవ క్షేత్రం సందర్శిస్తానని తెలిపారు.

## ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరికలు



**కావలి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. అల్లూరు మండలం పురిణి గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో సుమారు 30 కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. కావలి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు కావ్య క్రిష్ణా రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి స్వయంగా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ... కావలి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకుని నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత గౌరవం, సముచిత స్థానం లభిస్తుందని భరోసా ఇచ్చారు.

## రాయచోటిలో 'అంతర్రాష్ట్ర రౌడీ ముఠా'





**రాయచోటి,కలంకౌంటర్ :** పంజాబ్ నుంచి మారణాయుధాలతో వచ్చిన నేరగాళ్లు. తుపాకులు, ఆయుధాలతో ప్రజలను భయపెట్టేందుకు ప్లాన్. రెండు పిస్టళ్లు, బుల్లెట్లు స్వాధీనం. అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు అరెస్ట్.

## ఎలినినోప్రభావంతో పంటల సరళి పై రైతులతో సమీక్ష



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం ఎలినినో ప్రభావంతో పంటల సరళి రబీ లోమార్పు కొరకు రైతులతో జిల్లా వ్యవసాయ అధికారీ జ్యోతి రమణి రైతులతో సమీక్ష జరిపారు. కార్యక్రమంను ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి బంటుమిల్లి ఏడీఏ రమాదేవి బంటుమిల్లి , కృత్తివెన్నువ్యవసాయ అధికారులు రైతులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. సమీక్షలు ఇప్పటివరకు వాతావరణ నికి అనుగుణంగా జొన్నలు జిలుగులు పెసలు, మినుములు తైత్తర తక్కువ నీటిలో పండించే పంటల గురించి రైతులతో జిల్లా వ్యవసాయ అధికారి జ్యోతి రమణి ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి పార్థసారథి సమీక్షించారు.

## నెమలి పించం అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ లక్ష్మీ అమ్మవారు

**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఏడవ రోజు శ్రీ లక్ష్మీ అమ్మవారు నెమలి పించం అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకారం భక్తులను కనువిందు చేసింది శనివారం దసరా నవరాత్రులు ఏడవ రోజు సందర్భంగా శ్రీ కోదండరామస్వామి దేవస్థానం. శ్రీ కోదండ రాముల వారి ఉభయ దాత. ఇన్నమూరి రవిచంద్ర . శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఉభయ దాతలు . నీలిశెట్టి నాగేశ్వరరావు రాజారావు, తట్టవర్తి శీతారామయ్య కుమారుడు వెంకటేశ్వర్లు శ్రీ సరస్వతి అమ్మవారి ఉభయ దాతలు . నీలి శెట్టి నాగేశ్వర రావు రాజారావు, తటవర్తి శీతారామయ్య కుమారుడు వెంకటేశ్వర్లు ఉభయ దాతలు. పూజా కార్యక్రమం అనంతరంభక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# విజయవాడలో ఘనంగా జాతీయ సరస్ మేళా

- దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం
- 600 స్టాళ్లు, 50 లైవ్ ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు
- ప్రతిరోజూ 40 వేల నుంచి 50 వేల మందికి పైగా సందర్శకుల రాక
- ఇప్పటివరకు దాదాపు రూ. 2 కోట్లకు పైగా సేల్స్
- ఎన్ఐఆర్డి అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్






**విజయవాడ,కలంకౌంటర్ :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (సెర్ప్) సహకారంతో, భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోందని ఎన్ఐఆర్డి అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. స్థానిక పున్నమి ఘాట్ లోని సరస్ ఎగ్జిబిషన్ ప్రాంగణం లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో ఎన్ఐఆర్డి అడిషనల్ డైరెక్టర్ సు-ధీర్ కుమార్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెటింగ్ వేదిక కల్పించడంతో పాటు, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశం అన్నారు. జాతీయ సరస్ మేళాలో చేనేత, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తుల విభాగాల్లో సుమారు 600 స్టాళ్లను ఏర్పాటు చేశారన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వంటకాలను సందర్శకులకు అందించేందుకు 50 లైవ్ ఫుడ్ స్టాళ్లతో ప్రత్యేక ఫుడ్ కోర్టును అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సుమారు 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 1,500 మంది స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు.

**సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు..** మేళా ప్రాంగణంలో సందర్శకులు, కళాకారుల సౌకర్యార్థం వివిధ ప్రత్యేక పవిలియన్లను ఏర్పాటు చేశారన్నారు. గేట్ నంబర్ 2 వద్ద ఉన్న వెల్కమ్ పెవిలియన్లో హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, లాస్ట్ అండ్ ఫౌండ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించడంతో పాటు, వాటిపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించేందుకు కన్వర్జెన్స్ పవిలియన్ను ఏర్పాటు చేశారన్నారు. ఈ వేదిక ద్వారా ప్రభుత్వ పథకాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై సమాచారం అందిస్తున్నారన్నారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ ..** స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను నాణ్యమైన బ్రాండ్లుగా అభివృద్ధి చేసుకొని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేలా ప్రోత్సహించేందుకు మీట్ అండ్ గ్రీట్ పవిలియన్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎన్ఐఆర్డిపిఆర్ నిపుణులు, జాతీయ స్థాయి నిపుణుల సహకారంతో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఈ శిక్షణలో బ్రాండింగ్, ప్యాకేజింగ్, ఎగుమతి మార్కెటింగ్, వాల్యూ చైన్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల విజయగాథలు, వ్యాపార నైపుణ్యాలు, ఉత్పత్తుల ప్రత్యేకతలను ప్రజలకు పరిచయం చేసేందుకు లఖ్పతి దీదీ పవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. అలాగే మహిళలు తమ ఉత్పత్తులను స్వయంగా ఎలా తయారు చేస్తున్నారో ప్రత్యక్షంగా చూపించే డెమో పవిలియన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందన్నారు.

# రెడ్క్రాస్ సేవలు ఆదర్శనీయం - డాక్టర్ డి.ఆర్.కె. ప్రసాద్





**కావలి,కలంకౌంటర్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం చేకూరుతుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా చైర్మన్ డాక్టర్ డి.ఆర్.కె. ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన కావలిలోని రెడ్ క్రాస్ రక్తకేంద్రం, తలసేమియా సెంటర్తో పాటు నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ బృందం అందిస్తున్న విశిష్ట సామాజిక సేవలను, నాణ్యతా ప్రమాణాలను ఆయన ఎంతగానో ప్రశంసించారు. . ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు డాక్టర్ బెజవాడరవికుమార్, కె. హరినారాయణ రెడ్డి,జిల్లా రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు డా.పాదర్తి నాగరాజు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బి.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** దేవి శరన్నవరాత్రుల సందర్భంగా కందుకూరు పెద్ద బజారునంద ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రెసిడెంట్ కోట నరసింహం ఆధ్వర్యంలో అర్చకులు రాజా స్వామి ఎమ్మెల్యే కు తీర్థప్రసాదాలు, స్వామి వారి శేష వస్త్రం, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో కందుకూరు నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కృపా కటాక్షాలు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మురారి శెట్టి వెంకట సుబ్బారావు, గుర్రం సింగయ్య, మురారి శెట్టి శ్రీకాంత్, కొత్తూరి వెంకట సుధాకర్ రావు, చక్కా వెంకట కేశవరావు, కొత్త నరేంద్ర, ఇన్నమూరి నరసింహం, కోటా కిషోర్ బాబు,గుర్రం చిన అల్లురయ్య, తటవర్తి శ్రీను తదితరు ఆర్యవైశ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరార్యవశ్యులు పాల్గొన్నారు.

# మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కి సన్మానం



**కర్నూలు,కలంకౌంటర్ :** కర్నూలు చిన్న అమ్మవారి శాల లోఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య ను సన్మానించిన దృశ్యం.



## మచిలీపట్నం కూటమి మేయర్ అభ్యర్థిగా అబ్దుల్ అబీరా W/O హసీమ్ బేగ్

-మచిలీపట్నం,కలంకౌంటర్ :



## గుంటూరు మేయర్ టీడీపీ అభ్యర్థిగా 'రాయపాటి శైలజ' పేరు ఖరారు చేసిన టీడీపీ అధిష్ఠానం..!

-గుంటూరు,కలంకౌంటర్ :

## కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఏడవ రోజు శనివారం నగరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఉదయం నిర్వహించిన నవదుర్గల పూజలలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. రాత్రి చింతా వెంకట నాగ బాల కనక పద్మావతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి చరిత్ర లఘు నాటిక ఆకట్టుకున్నాయి. శ్రీ పార్వతి దేవిని మహాలక్ష్మి దేవిగా, కన్యకా పరమేశ్వరి దేవిని ధనలక్ష్మిదేవిగా అలంకరించారు. ఆలయ పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, సామా వెంకటలక్ష్మి కాంతారావు, ఉడత్తు శ్రీనివాసరావు, బైసాని హయగ్రీవ రావు అన్ని ఏర్పాట్లు చేశారు.





# మున్సిపల్ చైర్మన్ టిడిపి అభ్యర్థిగా వక్కలగడ్డ నామినేషన్..

● భారీ ర్యాలీతో కోలాహలంగా నామినేషన్ కు.... ● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కూటమి నేతలు, ● ఆర్యవైశ్య సంఘం నాయకులు, బిసి,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ నాయకుల మద్దతు.....







వక్కలగడ్డ నామినేషన్ లో ప్రముఖులు...

**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం మున్సిపల్ చైర్మన్ టిడిపి అభ్యర్థిగా వక్కలగడ్డ మల్లికార్జున శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు, కేంద్ర పార్టీ కేంద్ర మీడియా ప్రతినిధి ఏలూరి రామచంద్రారెడ్డి లు వెంట రాగా అత్యంత కోలాహలంగా భారీ ర్యాలీతో నామినేషన్ కు తరలి వెళ్లారు. నామినేషన్ సందర్భంగా ఆర్యవైశ్య సంఘాల నాయకులు టిడిపి ప్రముఖులు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సామాజిక వర్గాల నాయకులు తమ మద్దతు తెలిపారు. ఎన్నికల కార్యాలయంలో మార్కాపురం టిడిపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు....

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సూరె వంశావళి అధ్యక్షులు కృష్ణారావు దంపతుల పూజ.....

● ఘనంగా స్వాగతించిన దేవాలయం కమిటీ సభ్యులు..... ●వేద ఆశీర్వచనం, వస్త్రాలు బహూకరణ....







**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజయదశమి నవరాత్రి ఉత్సవాలలో సూర్యవంశావళి ఆధ్వర్యంలో అధ్యక్షులు సూర్య వెంకట కృష్ణారావు దంపతులు అమ్మవారికి పంచామృతాభిషేకం కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ సభ్యులు కృష్ణారావు దంపతులను మేళ తాళాలతో ఆయన స్వగృహం నుండి సాదరంగా స్వాగతం పలికి దేవాలయానికి తీసుకుని వెళ్లారు. గిద్దలూరు పట్టణ వేద పురోహితులు దుర్భాక ప్రవీణ్ స్వామి, రామ శర్మ అర్చక బృందం కృష్ణారావు దంపతులకు పంచామృత అభిషేకము కుంకుమార్చన పూజలను నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనంతో వస్త్రాలను తీర్థప్రసాదాలను అందజేశారు.

# టీడీపీలో చేరిన బోగోలు కీలక నేత కర్తం శ్రీనివాసులు రెడ్డి



**కావలి,కలంకౌంటర్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బోగోలు మండలానికి చెందిన వైసీపీ కీలక నేత, బోగోలు వైసీపీ జెడ్పీటీసీ అభ్యర్థి కర్తం సురేందర్ రెడ్డి సోదరుడు కర్తం శ్రీనివాసులు రెడ్డి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఆయన తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.? తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సమక్షంలో కర్తం శ్రీనివాసులు రెడ్డి పసుపు కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆయనను పార్టీలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# వైసీపీ మేయర్ అభ్యర్థి గా శ్రీదేవి నామినేషన్



**గుంటూరు,కలంకౌంటర్ :** గుంటూరు బృందావన్ గార్డెన్ మున్సిపల్ కార్యాలయంలో వైసిపి మేయర్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన తాడికొండ అలివేలు వెంకట నాగ పద్మ శ్రీదేవి..

# సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత





**కందుకూరు,కలంకౌంటర్ :** దేవి శరన్నవరాత్రులలో భాగంగా కందుకూరు పొట్టి శ్రీరాములు బజారు నందు ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడవ రోజు అమ్మవారు భక్తులకు సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రాజా స్వామి అమ్మవారిని కన్నులు పండుగగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం చిన్నారులకు సరస్వతీ పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ముక్కాల మయూరినాథ్ సతీమణి సుధామయి, వాసవి క్లబ్ నాయకులు గుర్రం చిన్న అల్లూరయ్య చేతుల మీదుగా చిన్నారులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అమ్మవారిని కందుకూరి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ పాలకవర్గం ఘనంగా సన్మానించారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణము ఆలపించారు.వలేటి వెంకట కొండలరావు ధర్మపత్ని మాధవీలత, బొగ్గవరపు వెంకట శివప్రసాద్ ధర్మపత్ని నాగమణి దేవి ఉభయ దాతలుగా వ్యవహరించారు. స్టూడెంట్ బ్యాగ్స్ వారు భక్తులకు బహుమతి అందజేశారు. సాయంత్రం గుడి ఉత్సవం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# నృసింహుడి సేవలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు





**కందుకూరు,కలంకౌంటర్ :** వలేటివారిపాలెం మండలంలో మాలకొండపై వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహా స్వామిని శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. వర్షాలు కురిసి, నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అంతకుముందు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం లభించింది. దర్శనం అనంతరం... కొండపై సౌకర్యాలు, వసతులు గురించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు భక్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. అన్న ప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే కొండపై జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా చూశారు. మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నేతలు ప్రగడ శ్రీనివాసులు, కామినేని అశోక్, శనివారపు మాల్యాద్రి, ప్రగడ మోహన్, కూడలి భాస్కర్ తదితరులు కూడా ఎమ్మెల్యే తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

# కరెన్సీ నోట్లతో దర్శనమిచ్చిన దుర్గామాత

---రూ 31,01,116/-ల కరెన్సీ నోట్లతో అలంకారం





**కందుకూరు,కలంకౌంటర్ :** కోవూరు రోడ్ లోని శ్రీశ్రీశ్రీ దుర్గా భవాని దేవస్థానం నందు దేవీ నవరాత్రులు ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈరోజు ఏడవ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయ కమిటీ వారు లక్ష్మీదేవి అలంకరణకు రూ 31,01,116/- (31 లక్ష వెయ్యి 116తోరూపాయల) కొత్త నోట్లతో అమ్మవారి అలంకరణ వైభవంగా చేశారు. కరెన్సీ నోట్లతో శ్రీ దుర్గా మాత దర్శనము ఇవ్వడంతో భక్తులు భక్తితో పరవశించిపోయారు. ఆలయ అర్చకులు కోవూరు మాధవరావు స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# పరిశీలన





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం లో నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ ఆర్ దామోదర్

# 9 వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గా విజయలక్ష్మి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం 9 వ వార్డు బ్రహ్మపురం నుండి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరామ పవన్ధీర్ సతీమణి వెంకట విజయలక్ష్మీ శానం నామినేషన్ దాఖలు.

# వైఎస్సార్ సీపీ చైర్మన్ అభ్యర్థి డా.భూమా నర్శింహారెడ్డి తరపున నామినేషన్ దాఖలు





**గిద్దలూరు,కలంకౌంటర్ :** అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికలలో వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి డా.నర్శింహారెడ్డి తరపున ఆయన కుమారుడు భూమా అరుణా సింహా రెడ్డి, అడ్వకేట్ దాసరి సంగీతరావులు నామినేషన్ దాఖలు చేశారు. గిద్దలూరు మున్సిపాలిటీ వైఎస్ఆర్సిపి 9 వ వార్డు అభ్యర్థిగా షేక్. సల్మా నామినేషన్ దాఖలు చేశారు.

# ఎమ్మెల్యే ఇంటూరి కి కృతజ్ఞతలు

–కందుకూరు జడ్పీటీసీ అభ్యర్థి రెబ్బవరపు మాల్యాద్రి



**కందుకూరు,కలంకౌంటర్ :** జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, యువ నాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి రెబ్బవరపు మాల్యాద్రి కృతజ్ఞతలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సామాజిక న్యాయాన్ని పాటిస్తూ దళిత బహుజనులకు అవకాశాలు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల్లో నూతన రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం, విద్యుత్ సదుపాయాల కల్పించడం, డ్రైనేజీ వ్యవస్థ వంటి పలు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని మాల్యాద్రి కొనియాడారు.

# కుటుంబ సమేతంగా కనకదుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి





**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎడవల్లి లక్ష్మణరావు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జగన్మాత అనుగ్రహం రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి అమ్మవారి ప్రసాదాన్ని సమర్పించారు.

# సారె సమర్పించిన పెనుగంచిప్రోలు దేవస్థానం అధికారులు



**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రి క్షేత్రానికి పెనుగంచిప్రోలు దేవస్థానం ఆలయ అధికారులు పాలకమండలి శనివారం మధ్యాహ్నం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు పెనుగంచిప్రోలు దేవస్థానం అధికారులకు పాలకమండలి సభ్యులకు స్వాగతం పలికారు. అమ్మవారికి సారి సమర్పించిన అనంతరం వేద పండితులు పెనుగంచిప్రోలు దేవస్థానం అధికారులకు పాలకమండలి వారికి వేద ఆశీస్సులు అందజేయగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ,) వారికి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేశారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తజన సందోహం

● భవానీల రాకతో పెరిగిన రద్దీ.. ● సమన్వయంతో ఏర్పాట్ల పర్యవేక్షణ



**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులతోపాటు భవానీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి నామ-స్మరణతో కొండపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు వాలంటీర్లు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ బృందాలు సేవలందిస్తుండగా, వైద్య బృందాలు ప్రాథమిక చికిత్స అందిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి.

**శాఖల మధ్య సమన్వయం:** జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం వివిధ శాఖల సేవలను సమన్వయం చేస్తోంది. దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆధ్వర్యంలో పోలీసులు భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపడుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్యం, పరిసరాల నిర్వహణపై సిబ్బంది దృష్టి సారిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ బృందాలు, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ సేవలను అందిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా సహకరిస్తున్నారు.





శనివారం పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో కలసి శ్రీ మహాలక్ష్మీదేవి అలంకృత అమ్మవారిని సినీ ప్రముఖులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న అనంతరం మీడియా పాయింట్ వద్ద విజయ్ దేవరకొండ దంపతులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని ఆకాక్షించారు.

–ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :

# దుర్గమ్మ వారికి సారె సమర్పించిన టీటీడీ



**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి దుర్గమ్మ వారికి సారెను శనివారం మధ్యాహ్నం సమర్పించారు. ఆలయ అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలు జాస్తి సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, ఆలయ సూపరిమెంట్ సూర్యనారాయణ టిటిడి సిబ్బంది సారెను అమ్మవారికి సమర్పించిన వారిలో ఉన్నారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ ) అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను వారికి అందజేశారు.

# దుర్గమ్మ వారికి సారె సమర్పించిన విశాఖపట్నం కనకమహాలక్ష్మి దేవస్థానం

● చైర్మన్ కందుల నాగరాజు ఈవో కె శోభారాణి, పాలకమండలి సభ్యులు





**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం విశాఖపట్నం కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కందుల నాగరాజు ఈవో శోభారాణి పాలకమండలి సభ్యులు బేబీ శోభారాణి అమ్మవారికి సారి ను సమర్పించారు. అమ్మవారి ఆలయానికి విచ్చేసిన కనకమహాలక్ష్మి అధికారులకు, పాలకమండలి సభ్యులకు గ్రామస్థానం అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారికి సారెను సమర్పించిన అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను దేవస్థాన అధికారులు అందజేశారు.











శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి అలంకృత అమ్మవారిని సినీ ప్రముఖులు అల్లరి నరేష్, సుబ్బరాజు దర్శించుకున్నారు.

–ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :



# అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శనివారం కనకదుర్గమ్మ వారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి జనసంద్రమైంది. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు సహా ఇతర కనీస సౌకర్యాలను కల్పిస్తున్నారు.

OWNER, PUBLISHER AND EDITOR BY : CH.VASAVIDEVI, PRINTED AT : SANAM VENKATA RAJASEKAR ARUNODAYA NOTE BOOK MANUFACTURERS PVT LMT, 33-5-9, 3RD FLOOR, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA, KRISHNA , AP - 520002. PRGI NO. APTEL/2016/69464. CELL 9346935672.